క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్చండి



తాడేపల్లి రూరల్ : మూడేళ్లు దాటిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని పెనుమాక సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని డోలాస్ నగర్‌లో అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యవేక్షించేందుకు విచ్చేసిన నిర్మల మాట్లాడుతూ.. 3 సంవత్సరాలు వయస్సు ఉన్న బాలబాలికలను ప్రతి తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా చిన్నారుల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. స్మార్ట్ టీవీలో విద్యాబోధన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ శకుంతల, అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎస్పీ



మంగళగిరి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డిడి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి జాతీయ రహదారిపై కార్యాలయంలో ఈ మేరకు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌కు పుష్పగుచ్ఛం, మొక్క ఇచ్చి అభినందనలు తెలిపారు.

పవన్ కళ్యాణ్‌కు స్వాగతం



తాడికొండ: మంత్రిగా బాధ్యతలు స్వీకరించేందుకు తొలిసారి సచివాలయానికి వచ్చిన పవన్ కళ్యాణ్‌కు తుళ్ళూరు మండలంలో ఘన స్వాగతం లభించింది. టీడీపీ, జనసేన నాయకులతోపాటు అమరావతి రైతులు ఆయనకు పూలతో స్వాగతం పలికారు. పచ్చ కండువా మెడలో వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అభిమానులు నినాదాలు చేస్తూ ఆయన వెంట సచివాలయానికి తరలివెళ్లారు.

'నీట్'పై సమగ్ర విచారణ చేయించాలి



లక్ష్మీపురం: దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షల్లో అవకతవకలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ చేయించాలని అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో పలువురు వ్యక్తులు కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం 'నీట్' అవకతవకలపై చర్చ మంగళవారం నిర్వహించారు. సమావేశంలో పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ డి.టి.సాయిబాబు మాట్లాడుతూ మే 5న నిర్వహించిన నీట్ పరీక్షను 24 లక్షల మంది రాశారని, వారి భవిత అగమ్యగోచరంగా మారిందన్నారు. కొన్ని రోజులుగా నీట్ స్కామ్‌పై అభ్యర్థులు గగోలు పెట్టడంతోపాటు, న్యాయస్థానాలను ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వం చివరికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేశాక స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించిందని వివరించారు. అయితే కుంభకోణంపై విచారణ జరిపిస్తామని గానీ, అభ్యర్థులకు న్యాయం చేస్తామని చెప్పలేదన్నారు. అవేవో సాధారణంగా చోటు చేసుకున్న చిన్న చిన్న తప్పులన్నట్లు పేర్కొనడం బాధాకరమన్నారు. మేధావుల ఫోరం కార్యదర్శి పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ కోర్టుల్లో విచారణ సందర్భంగా వెల్లడవుతున్న నీట్ అక్రమాలు అందరినీ నివ్వెరపరుస్తుందన్నారు. సమావేశంలో విద్యావేత్త పోతురాజు, సింగరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఉద్యోగి ఉదారత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతలు మరింతగా ముందుకు రావాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ఆస్పత్రిలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ఉస్మాన్ మంగళవారం రూ.7 వేలు విలువ చేసే ఈసీజీ పేపర్ రోల్స్‌ను సూపరింటెండెంట్‌కు అందజేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో ఉస్మాన్ రూ.10 వేలు విలువ చేసే పేపర్ రోల్స్ అందించారని గుర్తు చేశారు.

సాగు పనుల్లో యంత్రాలకే ప్రాధాన్యం


ఎద్దులతో పొలం దున్నుతున్న రైతు


ట్రాక్టర్‌తో దున్నుతున్న అన్నదాత

- తక్కువ సమయంలో ఎక్కువ లబ్ధికి రైతుల మొగ్గు
- ఆధునిక పద్ధతుల్లో సాగుకు పెరుగుతున్న ఆదరణ
- సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు రోజురోజుకీ డిమాండ్

తాడేపల్లిరూరల్ : కొన్నేళ్ల క్రితం వ్యవసాయ పనులన్నీ కేవలం ఎద్దులతోనే చేసేవారు. రానురాను సాంకేతికత పెరిగిపోవడంతో వాటి స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. గతంలో ముందస్తు వర్షాలు కురిస్తే పొలాలను ఎడ్లతో దుక్కిదున్ని పంటను సాగు చేసేందుకు అనువుగా చేసుకొనేవారు. విత్తనాలను సాగు చేయడం, పంటలో కలుపు మొక్కలను తొలగించడం, మందులను పిచికారీ , పంటను తొలగించే పనులు కేవలం మనుషుల ద్వారానే చేసేవారు. ఇప్పుడు విత్తనం సాగు నుంచి కలుపు తొలగించడం, మందులు పిచికారీ, పంటను తొలగించేందుకు అనేక రకాల పరికరాలను ట్రాక్టర్లకు అమర్చుకొని చేసుకుంటున్నారు. ఎక్కువ మంది మనుషులతో పని లేకుండా రైతులే ఒకరిద్దరితో కలిసి చేసుకుంటున్నారు. దీంతో వ్యవసాయ కూలీలు కూడా ఇతర పనులవైపు తప్పక మళ్లాల్సివస్తోంది.

తగ్గిన సేంద్రియ ఎరువులు

కొన్నేళ్ల క్రితం గ్రామాల్లో వ్యవసాయం చేసే రైతుల ఇళ్ల ముందు వ్యవసాయ అవసరాలకు ఎడ్లను, పాడి సంపద కోసం పాడి పశువులను పెంచి పోషించుకునేవారు. వాటిద్వారా వచ్చే పేడ, గోమూత్రం ఎరువులుగా మార్చుకొని పంట పొలాలకు వాడేవారు. వీటి ద్వారా పండించిన పంటల ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉన్నట్లు చెబుతుంటారు. నేడు విత్తనాలను నిల్వ చేసుకోవడం నుంచి సాగు చేసి పంట ఇంటికి చేరేవరకు అనేక రకాల రసాయన ఎరువుల వాడకం పెరిగింది. ప్రస్తుతం పశువుల ద్వారా వ్యవసాయం చేసేవారు కనుమరుగయ్యారు. చాలాచోట్ల మారుమూల గ్రామాల్లో సైతం వ్యవసాయానికి వాడే పశువులు లేకపోగా, యంత్రాల ద్వారా పంటలను సాగు చేసుకుంటున్నారు. రసాయన ఎరువుల ద్వారా పండించిన పంటలను తింటున్నందున రకరకాల రోగాల బారిన పడుతున్నామని పలువురు అభిప్రాయపడుతున్నారు. నేడు సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటలకు డిమాండ్ పెరిగింది. ఆ దిశగా కొందరు ప్రయత్నం చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో సేంద్రియ పంటలు ప్రజలకు చేరాల్సి ఉంది.

విద్యాసామగ్రి అందజేత


నుదురుపాడులో సామగ్రి అందజేస్తున్న షేక్ మస్తాన్ వలి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న వేమవరం సర్పంచి ఎం. శివకుమారి

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు విద్యాసామగ్రి బ్యాగ్, పుస్తకాలను విద్యాకమిటీ చైర్మన్ షేక్ మస్తాన్‌వలి అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఏవీవీ లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..:

మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్, సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కె.కోటేశ్వరరావు. మండవ నరసింహారావు, బాబు, పి.ప్రకాష్, నారాయణ, శేషు పాల్గొన్నారు.

వేమవరంలో..:

గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచి మున్నంగి శివకుమారి విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దివి కమల్‌మోహన్, తల్లిదండ్రుల విద్యాకమిటీ చైర్మన్ పి.రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల చోరుల పట్టివేత

మేడికొండూరు మండలంలో గేదెల వరుస చోరీలకు పాడి రైతులు లబోదిబో అంటున్నారు. ఈ నేపథ్యంలో నిఘా పెట్టి దుండగులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వేసవి కాలంలో పంట పొలాలు బీడువారడంతో గేదెలను రైతులు మేత కోసం వదిలి పెడుతుంటారు. అవి బీడు భూముల్లో మేత మేసి, తిరిగి యజమాని ఇంటికి చేరుతుంటాయి. ఈ నేపథ్యంలో కొందరు అర్ధరాత్రి సమయంలో గేదెలను చోరీ చేస్తున్నారు. లారీల్లో ఎక్కించుకుని గుట్టుగా తరలిస్తున్నారు. ఇటీవల మేడికొండూరులో 4, యలవర్తిపాడులో 2, భీమినేనివారిపాలెంలో 2, పాలడుగులో 4, కొర్రపాడులో 4 గేదెలు చోరీ అయ్యాయి. వీటి విలువ రూ. 15 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో బాధిత రైతులు అర్ధరాత్రి సమయంలో నిర్మానుష్య ప్రాంతంలో నిఘా పెట్టారు. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో గేదెలు కట్టి ఉన్న ప్రాంతానికి వచ్చిన నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మేడికొండూరు పోలీసు స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన గేదెల చోరీ కేసుల్లో నిందితులపై కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

వానా కాలం.. పిడుగుల కాలం

- పొలాలు, చెట్ల కింద ఉన్న వారిపై పడుతున్న పిడుగులు
- జాగ్రత్తలు పాటించాలని వాతావరణ నిపుణుల సూచన
- ఎత్తైన కట్టడాలకు లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి



సత్తెనపల్లి: వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. ఉరుములతో కూడిన వర్షం, పిడుగులు పడే అవకాశం ఉందని ముందస్తుగా రాష్ట్ర విపత్తు, నిర్వహణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. ఏ ప్రాంతంలో పిడుగులు పడతాయో ముందుగానే ఆ ప్రాంతంలో గల సెల్‌ఫోన్‌లకు విపత్తు నిర్వహణ శాఖ వారు మెసేజ్‌లు పెడుతున్నారు. ముఖ్యంగా పిడుగులు పడే సమయంలో సెల్‌ఫోన్లు వినియోగించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం వచ్చే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడుతుంటాయి. పిడుగు పాటు వల్ల విడుదలయ్యే పెద్ద పెద్ద ధ్వనులు, వెలుతురుతో పాటు విద్యుత్ శక్తి వస్తుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పిడుగు బారి నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి

పిడుగుపాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశాల నుంచి నేరుగా భూమిలోకి లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి. దీన్ని ఏర్పాటు చేసుకోవడం వలన పిడుగులో ఉన్న విద్యుదావేశం భూమిలోకి ఆకర్షించుకుంటుంది. ఎత్తైన కట్టడాలకు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

జాగ్రత్తలు పాటించాలి

మెరుపులు, ఉరుములు వచ్చే సమయంలో చెవులు గట్టిగా మూసుకోవాలి. పిడుగు శబ్దంతో వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. ఉరుములు, మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతానికి వెళ్లే అవకాశం లేకపోతే నేల మీదకు పూర్తిగా కిందకు వంగాలి. నేలపై పడుకోకూడదు. నేలపై కూర్చున్నప్పుడు పాదాలు ముందు భాగం మాత్రమే నేలను తాకాలి. శరీరంలోని మరే ఇతర భాగం నేలను తాకకుండా చూసుకోవాలి. పాదాల మడమల ముందు ఒకదానిని ఒకటి తాకేలా ఉండాలి. అలా చేయడం వల్ల పిడుగు పడే సమయంలో నేలపై పడి దాని విద్యుత్ శక్తి ఒక పాదం నుంచి శరీరంలోకి ప్రవహించిన వెంటనే రెండో పాదం నుంచి తిరిగి భూమిలోకి ప్రవేశిస్తుంది. శరీరంలోకి విద్యుత్ ప్రవహించే అవకాశాలు తగ్గుతాయి.


2023 మే 20న సత్తెనపల్లి రఘురామ్‌నగర్‌లో పడిన పిడుగుకు కాలిపోతున్న కొబ్బరి చెట్టు

ఇళ్లకు విద్యుత్ ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలి

- మేఘాలు దట్టంగా కమ్ముకున్నప్పుడు పిడుగులు పడతాయనే ఆలోచనకు రావాలి.
- కళ్లు మూసుకోవడం వల్ల ప్రసార కాంతి నుంచి తప్పించుకోవచ్చు. భూమిపై ఉన్న ఎలాంటి లోహాలను తాకకూడదు.
- పొలాల్లో ఆరుబయట ఉన్నప్పుడు చెట్ల కిందికి వెళ్లకూడదు. ఎత్తైన చెట్లు, స్తంభాలు పిడుగులను ఆకర్షిస్తాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జూన్ నెలలో ఎక్కువగా పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు క్యుములో నింబస్ మేఘాల కారణంగా పిడుగులు పడే ప్రమాదం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. వర్షం వస్తున్నట్లు ముందే తెలుస్తుంది కాబట్టి వీలైనంత వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ఉంటే మంచిదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఏం చేయకూడదు?

- వర్షం కురిసేటప్పుడు చెట్ల కింద నిలబడరాదు.
- ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో రైతులు పొలాల్లో ఉండకూడదు.
- పెద్ద మెరుపు కనిపించిన తర్వాత 30 నిమిషాల వరకు బయటకు వెళ్లకూడదు.
- ముఖ్యంగా ఆ సమయంలో సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకోవాలి. లేదంటే రేడియేషన్ తరంగాలకు గురయ్యే ప్రమాదం ఉంది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ తీగల కింద, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరగా ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెప్పులు లేకుండా బయటకు వెళ్లకూడదు.
- గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో భయాందోళనకు గురయ్యే ఆస్కారం ఉంది. ధైర్యంగా ఉండాలి.

ప్రథమ చికిత్స ఇలా...

- ఎడుగుపాటుతో అస్వస్థతకు గురైన వారిని వెంటనే గాలి, వెలుతురు తగిలే విశాలమైన ప్రాంతంలో ఉంచాలి.
- తడి దుస్తులు తొలగించి పొడి దుస్తులు వేయాలి.
- తిన్నగా పడుకోబెట్టి రెండు కాళ్లు పైకి ఎత్తి ఉంచాలి.
- తలను ఒక వైపు తిప్పి పెట్టాలి.
- ఆ సమయంలో నోటి ద్వారా నీరు, ఇతర ఎలాంటి ఆహారాన్ని అందించకూడదు.
- వెంటనే అందుబాటులో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించాలి.

ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల తనిఖీ

పట్నంబజారు: విద్యా సంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని వాహనాలపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టి బస్సులపై కేసు నమోదు చేస్తున్నారు. దానిలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి అనుమతులు తీసుకొని నిబంధనలు ఉల్లంఘించిన 15 బస్సులు, 60 పిల్లపై బడి వాహనాలు నడపుతున్న డ్రైవర్‌కు సంబంధించి ఒక కేసు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎస్‌పీ) లేనివి రెండు కేసులు కలిపి మొత్తం 18 కేసులు నమోదు చేశారు. విద్యా సంస్థలకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలని డీటీసీ షేక్ కరీం కోరారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి జరిమానా విధించడంతో పాటు, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సక్రమంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

- ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్
- సచివాలయ సెక్రటరీలకు పలు సూచనలు


పుష్కర ఘాట్ల వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి, నులకపేట, ఉండవల్లి సెంటర్ పరిధిలోని సచివాలయాలను మంగళవారం ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ సందర్శించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను ప్రతిరోజు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రహదారులపై ఆక్రమణలు జరగకుండా ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. రోడ్లపై అనధికారంగా ఎలాంటి తాత్కాలిక నిర్మాణాలు, ఇతర నిర్మాణ సామగ్రి వేయకుండా చూడాలని పేర్కొన్నారు. రోడ్లపై అక్రమంగా తోపుడు బండ్లు, బడ్డీ కొట్టు వంటివి ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ సమయంలోనైనా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు సచివాలయాలకు ఆకస్మికంగా తనిఖీ చేసే అవకాశం ఉందని తెలిపారు. రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పలు పోటీల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ


ఆడుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



చర్చా వేదికలో పాల్గొన్న క్యాడెట్లు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం లోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ రాజస్థాన్, ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్‌లకు చెందిన క్యాడెట్‌లకు వివిధ రకాల క్రీడలతోపాటు చర్చా వేదిక పోటీలను నిర్వహించారు. జరుగుతున్న ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ రెండో కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ ద్వారా దేశంలోని ఆయా ప్రాంతాలకు చెందిన యువతను ఒక వేదికపైకి చేర్చి వారికి భిన్నత్వంలోని ఏకత్వమైన భారత సమైక్యతను చాటిచెబుతున్నట్లు వివరించారు. ఈ పోటీలలో క్యాడెట్‌లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారని అన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సీఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, కేఎల్‌యూ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష నేత నాగేశ్వరరావుకు నివాళి


నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రవి, వెంకటేశ్వరరావు

దొండపాడు (తాడికొండ): తొలితరం కమ్యూనిస్టు నేత నెలకుదిటి నాగేశ్వరరావు జీవితం ఆదర్శనీయమని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, డివిజన్ కార్యదర్శి ఎం రవి అన్నారు. నాగేశ్వరరావు 79వ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన తుళ్ళూరు మండలం దొండపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్తూపం, సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి సీపీఎం పతాకాలను ఆవిష్కరించారు. తర్వాత జరిగిన సభలో రవి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో తొలి తరానికి చెందిన రైతు నాయకులలో ప్రజాదరణ పొందిన ఆదర్శ నాయకుడు నెలకుదిటి అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అహర్నిశలు కృషి చేస్తూ చిన్న వయసులో ప్రాణాలు కోల్పోయిన ప్రజా సేవకుడని కొనియాడారు. ఈ సభలో మాజీ ఎంపీటీసీ నెలకుదిటి వెంకటేశ్వరరావు, మైనేని గిరిజ, సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబురావు, కుంభా ఆంజనేయులు, జే నవీన్ ప్రకాష్, నెలకుదిటి నాగేశ్వరరావు, గూడూరు నాగమల్లేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, గూడూరు బుల్లిబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చేబ్రోలులో భారీ వర్షం

చేబ్రోలు: ఉదయం తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో ఊరట లభించింది. భారీ వర్షం కురవటంతో ప్రజలు సేద తీరారు. చేబ్రోలు మండలంలో మంగళవారం భారీ వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. కొద్దిరోజులుగా ఆకాశం మేఘావృతం కావటం, కొద్దిపాటి జల్లులు మాత్రమే కురిసేవి. మంగళవారం ఉదయం నుంచి వేసవి ఎండలా వేడి ఉండటంతో ప్రజలు అల్లాడారు. సాయంత్రం భారీ వర్షం కురిసి చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఈ వర్షంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు.

వేణుగోపాలస్వామికి పచ్చ కర్పూరంతో అలంకారం


భక్తుల కోలాటం


స్వామి రథోత్సవం

నగరంపాలెం: కొత్తపేట(పశువుల ఆస్పత్రి ఎదురు)లోని జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం వేణుగోపాలస్వామికి పచ్చకర్పూరంతో అలంకరించారు. గరుడ వాహనంపై గ్రామోత్సవం, మన్యుసూక్త హోమం నిర్వహించారు. రాత్రి గుంటూరు నగర పుర వీధుల్లో స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జగన్నాథస్వామి, ఆంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్(ఈఓ) డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు శ్రీఅయోధ్యఅయ్యప్ప పాల్గొన్నారు.

మోహిని అలంకారంలో వేంకటేశ్వరస్వామి

నగరంపాలెం: లాలాపేటలోని పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామికి మోహిని అలంకారం చేశారు. ఉదయం 7 గంటలకు నిత్య హోమం బలిహరణ, 108 కలశాలతో అష్టోత్తర కలశ సపన అభిషేకాలు నిర్వహించారు. రాత్రి హనుమత్ వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. ప్రధాన ప్రాంతాల్లోని దుకాణదారులు, భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జగన్నాథ, ఆంజనేయ స్వామి, వేంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ (ఈఓ) డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్‌టీఆర్‌వీ ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీచంద్రకుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గౌతమీ నగర్‌లో నివాసం ఉండే కడియం లూర్ధు మేరి(47) నీటి మోటారుకు పైపు అమర్చుతుండగా సోమవారం షాక్‌కు గురైంది. ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com